కార్మికుల బంద్ సక్సెస్

పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాలు

ఉప్పల్, మేడ్చల్, మల్కాజిగిరి జోన్ బృందం, ఫిబ్రవరి 16: దేశ వ్యాప్త సమ్మె సందర్భంగా పలు కార్మిక , ప్రజా సంఘాలు బంద్ పాటించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ,ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, బీఆర్‌టీయూ, టీఎన్‌టీయూసీ, ఏఐయూటీయూసీ, సీసీజీఈడబ్ల్యూ, ఏఐడీఈఎఫ్, బ్యాంక్స్, ఇన్సూరెన్స్, సంయుక్త కిసాన్ మోర్చా తదితర కార్మిక సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

☞ **జవహర్‌నగర్‌లో..** నిర్వహించిన కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శివబాబు, కాప్రా మండల సీపీఐ పార్టీ కార్యదర్శి యాదగిరి, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

☞ **చర్లపల్లి:** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చర్లపల్లి పారిశ్రామికవాడలో సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

☞ **కాప్రా :** సార్వత్రిక సమ్మె సందర్భంగా కాప్రాసర్కిల్‌లో పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించారు. సర్కిల్ పారిశుధ్య కార్మికుల నేతలు కుర్మన్న, యాకయ్య పాల్గొన్నారు.

☞ **శామీర్‌పేట :** జాయింట్ ప్లాట్ ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కార్మికులు, కార్మిక సంఘాల నేతలు సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కిష్టప్ప, రవీందర్, సంగప్ప, ముత్యాలు, ఐఎఫ్‌టీయూ యాదయ్య, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, కార్మికులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల కార్మికులు

☞ **రామంతాపూర్ :** బీఆర్‌టీయూ నాయకులు తిప్పని సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ఉప్పల్ పారిశ్రామిక వాడలో సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మారుతీరావు, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉప్పల్‌లో నిర్వహించిన సమ్మెలో సీఐటీయూ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న, నేతలు గౌస్, యాదగిరి, వెంకటేశ్, పాండు, జంగయ్య, శ్రీనివాస్, వినోద, రామనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్స్‌లో వ్యక్తి మృతి..

శామీర్‌పేట, ఫిబ్రవరి 16 : స్నేహితుడి రిసెప్షన్‌కి వెళ్లిన వ్యక్తి లియోనియాలో మృతి చెందాడు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన చింతల భరత్‌రెడ్డి వైద్యవృత్తి నిర్వహిస్తున్నాడు. ఈ నెల 14న బొమ్మరాశిపేటలోని లియోనియాలో స్నేహితుడి రిసెప్షన్‌కు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. మరుసటి రోజు భార్య అతడికి కాల్ చేయగా స్పందించలేదు. వెంటనే లియోనియా రిసార్ట్స్‌కి కాల్ చేయగా.. మధ్యాహ్నం రిసార్ట్స్‌లోని 2861 రూమ్‌లో అపస్మారక స్థితిలో పడిఉన్నాడని యాజమాన్యం సమాచారం ఇచ్చింది. వెంటనే 100కి కాల్ చేసి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు అదృశ్యం..

పీర్జాదిగూడ ఫిబ్రవరి 16: ఫొటోగ్రాఫర్ అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం....పీర్జాదిగూడ, అన్నపూర్ణ కాలనీలో నివాసం ఉంటున్న ఈదుగ పురుషోత్తం గౌడ్ (32) స్థానికంగా పద్మవేణి పేరుతో ఫొటో స్టుడియో నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12న సాయంత్రం ప్రోగ్రాం చేయడానికి వెళ్తున్నానని చెప్పి షాపు నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్‌లో వివాహిత..

జవహర్‌నగర్, ఫిబ్రవరి 16: జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అదృశ్యమైంది. ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం... యాప్రాల్ నివాసి మౌనిక (22) గురువారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల కుటుంబంలో గొడవలు జరుగుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మరోచోట యువతి..

ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం... దమ్మాయిగూడకు చెందిన బింగి శ్రీహరి పెద్ద కుమార్తె అంకిత(17) ఇంటర్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటుంది. తల్లిదండ్రులు పనులకు వెళ్లి తిరిగి వచ్చేలోపు అంకిత కనిపించలేదు. ఆమె ఆచూకి కోసం వెతికినా ఫలితం లేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరమ్మతులకు రూ.62 లక్షలు

కాప్రా, ఫిబ్రవరి 16: కాప్రాసర్కిల్ కార్యాలయం భవనం మరమ్మతులకు రూ.62లక్షలతో ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు కోసం జోనల్ కార్యాలయానికి పంపించామని ఈఈ హరిలాల్ తెలిపారు. మంజూరు లభించిన వెంటనే టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

మల్కాజిగిరి/ నేరేడ్‌మెట్/బోడుప్పల్, ఫిబ్రవరి 16 : రథసప్తమిని పురస్కరించుకొని సైనిక్‌పురి శృంగేరి శంకర్‌మఠ్ విజయ గణపతి దేవాలయంలో శృంగేరి జగద్గురు శ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి వారి అనుగ్రహ ఆశీస్సులతో లోకల్యాణం కోసం పూజా కార్యక్రమాలు నిర్వహించామని మఠం ధర్మాధికారి శ్రీ పండరినాథ్ తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని సూర్యప్రభ వాహనంపై పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రఘు పంతులు, వంశీ పంతులు, సురేందర్ రెడ్డి, రామచంద్రరావు, శివరామకృష్ణ, నాగరాజు, రాజు పాల్గొన్నారు. బోడుప్పల్ పరిధిలోని పెంటారెడ్డి కాలనీ నిమిషాంబికాదేవి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

శృంగేరి శంకర్‌మఠ్‌లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కరిగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఉప్పల్, ఫిబ్రవరి 16 : ఉప్పల్ స్వరూప్ నగర్‌లోని కరిగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రాల మధ్య, అంగరంగ వైభవంగా ఉత్సవాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ ఉత్సవాలు ఈ నెల18 వరకు జరుగుతాయని నిర్వాహకులు శ్రీనివాస్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పూజారులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణమాచారి, శ్రీనివాస్‌రెడ్డి, శామీర్‌పేట ధర్మారెడ్డి పాల్గొన్నారు.

రైతుబంధు ఇప్పించాలని వినతి

శామీర్‌పేట, ఫిబ్రవరి 16 : రైతుబంధు ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు శామీర్‌పేట మండలం లాల్‌గడీమలక్‌పేటకు చెందిన పలువురు రైతులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

ఉప్పల్ సమస్యలను పరిష్కరించండి

ఉప్పల్, ఫిబ్రవరి 16 : అసెంబ్లీ సమావేశాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక సమస్యలపై మాట్లాడారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. నియోజకవర్గంలోని ఉప్పల్, రామంతాపూర్, నాచారం, కాప్రా చెరువులను సుందరీకరించాలని, గుర్రపుడెక్కను తొలగించాలని కోరారు. దోమలను నియంత్రించాలని, మురుగు నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. అలాగే ఉప్పల్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఎస్టీపీలను వెంటనే ప్రారంభించాలని, గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, ఉప్పల్ ప్రధాన రహదారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉప్పల్ సమస్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందిస్తూ, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

సీసీ కెమెరాలకు విరాళం..

మల్లాపూర్, ఫిబ్రవరి 16 : ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేయడం ఆనందంగా ఉందని మల్లాపూర్ డివిజన్ బాబానగర్‌కు చెందిన ముచ్చటి సాయిలోకేశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం డివిజన్ పరిధిలోని నందీశ్వర ఆలయం దేవస్థానానికి 8 సీసీ కెమెరాలకు రూ. 51వేలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు.

కీసర ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి 16: కీసర ఆర్డీవోగా వెంకట ఉపేందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రనగర్‌లో ఆర్డీవోగా పనిచేస్తున్న ఆయనను కీసరకు బదిలీ చేశారు.

మూడుచింతలపల్లి తాసీల్దార్‌గా వెంకటనర్సింహారెడ్డి

శామీర్‌పేట : మూడుచింతలపల్లి మండల తాసీల్దార్‌గా వెంకటనర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తాసీల్దార్‌గా పని చేస్తున్న వాణిరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఉప్పల్ నుంచి వెంకట నర్సింహారెడ్డి మూడుచింతలపల్లికి బదిలీపై వరు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయనకు రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఉప్పల్, ఫిబ్రవరి 16 : పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేయాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఉప్పల్ వాటర్‌వర్క్స్, సీవరేజ్‌బోర్డు అధికారులతో శుక్రవారం కార్పొరేటర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... సమస్యలపై చర్చించి, కాలనీల్లో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం రజనీకాంత్, ఏజీఎం సత్యనారాయణ, నేతలు ప్రవీణ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి, అశోక్ చారి, శ్యామ్, బాలు పాల్గొన్నారు.

జడ్పీని కలిసిన కార్పొరేటర్

ఉప్పల్, ఫిబ్రవరి 16 : నాచారం డివిజన్‌లో మంజూరు చేసిన పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. ఈ మేరకు ఎల్బీనగర్‌జోన్ జోనల్ కమిషనర్ పంకజను శుక్రవారం కార్పొరేటర్ కలిసి వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్లు, నూతన బ్రిడ్జి పనులు, తదితర సమస్యలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మేడ్చల్, ఫిబ్రవరి 16 : విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే సాంకేతికతతో పాటు సమాచార నైపుణ్యాలు అవసరమని హెక్సాగోన్ కాపిబిలిటీ సెంటర్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ కొనిదేవ అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఫ్యూచర్ శస్త్ర 2కే24 పేరుతో నిర్వహిస్తున్న రెండు రోజుల టెక్నికల్ సింపోజియంను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, కో ఆర్డినేటర్ కల్పన, డీన్లు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామసభతోనే సమస్యలు పరిష్కారం

కీసర, ఫిబ్రవరి 16: గ్రామసభతోనే సమస్యలు పరిష్కారమవుతాయని కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని చీర్యాల్‌లో పంచాయతీ కార్యదర్శి నారాయణ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్, ప్రాథమిక సహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పరామర్శ..

మల్లాపూర్, ఫిబ్రవరి 16 : మల్లాపూర్ డివిజన్ బీరప్పగడ్డకు చెందిన కురుమ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బెల్లం గట్టయ్య ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి శుక్రవారం గట్టయ్య ఇంటికి వెళ్లి పరామర్శించారు.

గిర్మాపూర్ వ్యక్తికి జాతీయస్థాయి అవార్డు

అవార్డుతో దేవేందర్ ప్రసాద్

మేడ్చల్, ఫిబ్రవరి 16 : జాతీయ స్థాయిలో నిర్వహించిన పోలీస్ ఫొట్రోగఫీ పోటీల్లో మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని గిర్మాపూర్‌కు చెందిన దేవేందర్ ప్రసాద్ జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. గిర్మాపూర్‌కు చెందిన దేవేందర్ ప్రసాద్ సైబరాబాద్ కమిషనరేట్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా ఆయన శాఖకు అవసరమైన ఫొటోలను తీస్తుంటారు. కాగా.. ఈ నెల 12 నుంచి 16 వరకు ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 67వ ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమం ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ నుంచి దేవేందర్ ప్రసాద్ పాల్గొని, తాపు తీసిన ఫొటోలను ప్రదర్శించాడు.ప్రతిభను గుర్తించిన అధికారులు ప్రథ మ బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

సీసీ రోడ్డు ప్రారంభం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని సాయిరాం నగర్‌లో జడ్పీ నిధులు రూ.5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును శుక్రవారం స్థానిక నాయకులు కట్టు ఆంజనేయులు గౌడ్, మాజీ వార్డు సభ్యులు భోజిరెడ్డి, పి.నర్సింగ్‌రావు ముదిరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్ నాయక్, నర్సింహ,, సందీప్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, దావిద్‌రెడ్డి, క్రాంతి పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Dt: 16-02-2024

The General public is hereby informed that my client Sri Sangewar Ravi Kumar, S/o. Sangewar Ganagaram, Aged about 45 years, Occupation: Private Employee, Resident of Nizamabad, Telangana, has entered into an Agreement of Sale with Muppaneni Srikanth, S/o. M.Adinarayana, Aged about 60 years, Occupation: Business, Resident of House Pet Basheerabad, Jeedimetla, Medchal-Malkajgiri District, Telangana represented by GPA Holder Sri Percherla Prakash Raju, S/o. Late. P. Ramakrishnam Raju, Aged about 46 years, Occ: Business, R/o. Hyderabad, to purchase an Open Plot bearing No. A-13/Part (South side portion), in "A-Series" of "METRO HOMES" (Nisha Enclave), admeasuring 170 sq.yards or 142.12 sq.mtrs. in part of Survey Nos. 113, 114, 120, 121, 123, 124 & 124/A, situated at Ravalkole Village and Gram Panchayat, Mechal Revenue Mandal, Medchal-Malkajgiri District, Telangana with following boundaries: NORTH: Plot No. A-13/Part, EAST: 33' Wide Road, SOUTH: Plot No. A-12, WEST: Plot No. A-13A and paid substantial amount towards part sale consideration of the property.

If any person(s) having right, interest, claim and title or objection over the schedule property may contact the undersigned with relevant proof of documents within (07) days from the date of publication of this notice. Otherwise, the registration of the sale deed will be executed, thereafter no such claim shall be entertained.

Sd/- **ANANTH VENKAT RAO KURAPATI (AVRK), K.RAJU,** Advocates
Flat No. 302, 'A' Block, Ameena Complex, Metro Pillar No. 905, Uppal, Hyderabad, Telangana-500 039,
E-Mail Id: avrklawassociates@gmail.com,
Mobile: 9505676999.

అలసత్వం వహించొద్దు..

జవహర్‌నగర్, ఫిబ్రవరి 16: అధికారులు పనుల్లో అలసత్వం వహించరాదని కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవికాలంలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

బోడుప్పల్, ఫిబ్రవరి16: బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని మేయర్ సామల బుచ్చిరెడ్డి తెలిపారు. శుక్రవారం 10, 22 డివిజన్లలో కార్పొరేటర్లు బొమ్మక్ సుగుణబాలయ్య, మహేశ్వరితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. డీఈ శారద, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొమ్మక్‌బాలయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

మేడ్చల్, ఫిబ్రవరి 16 : విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని సేయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 'నాలెడ్జ్ ఇంజినీరింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్'పై కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఐఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఏఐ పరిజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, భువనేశ్వర్ ప్రిన్సిపాల్ సుబంధు కుమార్ ఫణి, అమరావతి యూనివర్సిటీ ప్రొఫెసర్ నందన్ మహంతి, అకాడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, డీన్ లక్ష్మిదేవి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16 : ఘట్‌కేసర్ మండలం వెంకటాపురంలో ఉన్న అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులు మూడేండ్ల ఎన్‌సీసీ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ బైసన్ గ్రౌండ్‌లో ఎన్‌సీసీ సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షను గ్రూప్ కెప్టెన్ వర్షా గోఖులే, వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి, కాకినాడ ఎయిర్ ఎన్‌సీసీ యూనిట్‌తో కలిసి పూర్తి చేసినట్లు సీఓటి మల్లేశ్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు.